

# ప్రముఖ చిత్రకారుడు సంజీవదేవ్



నిత్యం వెలువడుతాయి పూర్వ దిగంతంలో గులాబీ సూర్యోదయం, పశ్చిమ దిగంతంలో సింధూర సూర్యాస్తమయం, కాని ఈ దీప్తివంత దిగంతాలను ఎందరు తన్మయదృష్టితో తిలకిస్తారు? కొందరు మాత్రమే... ప్రతినెలా నెలవంక ముగ్ధవదువు వలె మృదువుగా సంధ్యాకాశం మీద ప్రత్యక్షమవుతుంది. కాని, ఎందరు దానివైపు ఒక్కకటాక్షమైనా ప్రసరించే శ్రద్ధ కనబరుస్తారు? కొందరు మాత్రమే... ప్రతి సంవత్సరం శారద ప్రభాతం ప్రత్యక్షమవుతుంది. గడ్డి మొలకలపైన ఇంద్రధనువు కాంతులతో ధగధగలాడే హిమ బింధువులతో,శారద నీలాకాశం కింద ఈ మెరుస్తున్న రంగుల హిమకణాలు సున్నిత హృదయాలలో నిజంగా అనంతపు ఆనంద ప్రకంపనలను రేకెత్తిస్తాయి. ఈ శారద దృశ్యాన్ని తిలకించి ఎందరు ఆనందిస్తారు? కొందరు మాత్రమే. ఎందుకని ఈ నిర్లక్ష్యం? దైనందిన కార్యకలాపాల నుండి తీరికలేకనా? కాదు, రసదృష్టి లేనందునే. 1946లో శిల్పిలో ఈస్తటిక్ విజన్ పేరిట డాక్టర్ సంజీవ్‌దేవ్ రాసిన వ్యాసంలో బాహ్య రూపాలలోని సౌందర్యాన్ని ఆనందించాలంటే మానవునిలో రసదృష్టి ఉండాలంటున్న పై వాక్యాలు చాలు. ప్రకృతిని ఆయన ఎంతగా ప్రేమించాడో చెప్పేందుకు ఆ రసదృష్టితో శారద దృశ్యాన్ని తిలకించి తద్వారా కలిగిన ఆనందానుభూతులను అనుభవించి ఊరుకోలేదాయన. తాను చూసిన దృశ్య జగత్తును సృష్టించాలని ఆరాటపడ్డారు. ఆయన తెనాలి సమీపంలోని తుమ్మపూడిలో తన చిత్రాల్లో ఆహ్య సృష్టికి ప్రతిసృష్టి చేసి కళానిర్మాతగా వాసికెక్కారు. మూడున్నర దశాబ్దాలకుపైగా చిత్రకళాజగత్తులో రూపరచన, అంతకు మించి రంగుల రచనలు చేశారాయన. సంజీవదేవ్ చిత్రాలు ఆయనలోని అభిరుచిని, వారి రంగుల కలయికను, ప్రకృతిని ప్రకృతి కోణం నుండి చూపించే ప్రత్యేకతను కలిగి ఉంటాయి. ఇందుకాయన ఎవరివద్దా చిత్రకళా శిక్షణ పొందలేదంటే ఆశ్చర్యమేస్తుంది. చిత్రకళలో, సాహిత్యంలో ఇంతటి పరిజ్ఞానాన్ని, ఔన్నత్యాన్ని సంతరించుకోవటానికి సంజీవదేవ్ జీవనగమనమే ప్రధాన కారణం. ప్రకృతి

అందాల్ని గ్రహించనంతటి రమ్యంగా ప్రకృతికే అందించిన సహజ సౌందర్య శోధకులు కావటానికి ఆయనను చిన్ననాటనేమైమరపించిన హిమాలయాలు, ప్రఖ్యాత చిత్రకారులు నికోలస్ రోరిక్, అసిత్‌కుమార్ హల్దర్ సాంగత్యం తోడ్పడ్డాయి. నాలుగు పదుల వయసులో చిత్రకళలోకి ప్రవేశించినా అంతకు ముందెన్నడో మనసు పొరల్లోంచి చూసిన హిమాలయ  దృశ్యరూపాలను తన రస హృదయంలోకి రప్పించుకుని చిత్రాలు గీసేవారు. ప్రకృతి చిత్రకళా సృజనకు చాలా అనువైంది. అందులోను ఆధునిక చిత్రరచనా రీతిలో చాలా ప్రేరణాత్మకమైందని  సంజీవదేవ్ చెప్పేవారు. ఆయన సాధారణంగా రూపాలకు రంగులు దిద్దరు. ఆయన చిత్రాల్లో రంగులే రూపాలను రూపొందించుకుంటాయి. రూపం నిమిత్తమాత్రంగా రంగు ప్రధానంగా, వర్ణరూప చిత్రణతీరు భావానుబంధంగా ఉంటుంది. తాను వేయాల్సిన చిత్రాన్ని ముందుగా ఎలాంటి స్కెచ్ వేయకుండానే నేరుగా కుంచెనురంగులో ముంచి చిత్రించడం సంజీవదేవ్ ప్రత్యేకత. కుంచెకన్నా ప్యాలెట్ నైఫ్‌ను, ఆ తరహా వాటినే ఎక్కువగా ఉపయోగించేశారు. అలాగే చిత్రకళ రచనలో వీరు ప్రారంభంలో వాటర్ కలర్స్, ప్యానల్స్‌ను ఉపయోగించారు. చివరలో అక్రిలిక్ పెయింట్స్‌ను ఎక్కువగా వాడారు. సంజీవదేవ్ చిత్రాలు చాలా గమ్మత్తుగా ఉంటాయి. చూపరుల దృష్టికి కొంత సారూప్యంగాను, భావానికి, రచనా రీతికి నైరూప్య రీతిని కలిగి ఉంటాయి. దూరంగా కొండలు ఉండీ లేనట్లుగా, కొంచెం దిగువన ఒక చిన్న గుట్ట, వాటి వెనుక ఒక వెలుగు, వీటన్నింటినీ బ్యాలెన్స్ చేస్తూ ఒక మూలచలిమంట... ఇలాంటి చిత్రాలు వేసే హృదయంపై ఆధారపడి, రకరకాల అనుభూతులను కలిగిస్తాయి. తాను చూపదలచుకుందీ, చెప్పదలచింది తాను ఎక్కువ శ్రమపడకుండా చూపరులను ఎక్కువ శ్రమపెట్టకుండా నామమాత్రపు రూపాలతో గొప్ప అనుభూతిని కలిగించడం ఆయనలోని విశిష్టత. ప్రకృతి చిత్రాలలో పకృతిని ఆయన యధాతథంగా చిత్రించారు. తన సృజనాత్మకతతో వాటిని రసాత్మకంగా చిత్రించారు. సంజీవదేవ్ ప్రధానంగా ప్రకృతి చిత్రకారులు. రంగుల ప్రకృతి చిత్రకారులుగా ఖ్యాతిని పొందారు. ఆయన చిత్రాల్లో తొలిదశలో కనిపించిన వస్తువు డీటైల్స్ తర్వాతి కాలంలో కరిగిపోయాయి. కవికాని, చిత్రకారుడుకాని కంటికి కనిపించేదాన్ని మాత్రమే చిత్రిస్తే సత్యాన్ని





కాక సత్యభ్యాసను మాత్రమే చిత్రించడమవుతుందని సంజీవదేవ్ అనేవారు. ప్రసిద్ధ చిత్రకారులైన నికొలస్ రోరిక్, అసిత్‌కుమార్ హల్దార్‌ల సాహచర్యంలో వున్నా ఆనాడు సంజీవదేవ్ చిత్రాలను గీయలేదు. రచనా వ్యాసంగంలో కొనసాగుతుండగా వారి జీవితంలోకి చిత్రకళను ఆహ్వానించారు. ఆధునిక చిత్రకళను అభిమానించే ఆయన చిత్రాల్లో రోరిక్, హాల్దార్‌ల ప్రభావం కనిపించదు. సంజీవ్‌దేవ్ గొప్ప చిత్రకారుడు అనటంలో సందేహం లేదు. కానీ ఆయన జీవన యాత్ర చిత్రకారుడితోనే నిలిచిపోలేదు. ఆయనలోని సాహిత్య సాంస్కృతిక స్రవంతి ఎన్నో పాయలుగా ప్రవహించింది. ఆ స్రవంతిలోని ప్రతిపాయ కూడా ఎన్నో లయమయమైన వంపులు తిరిగి ప్రాణవంతంగా ప్రవహించింది. ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన చిత్రాల్లోని రంగుల రమ్యకాంతుల్లో నిత్యం జీవించే వున్నారు.

- ప్రజాశక్తి విలేకరి, తెనాలి.

సేకరణ : మన తెనాలి నియోజకవర్గ ప్రత్యేక సంచిక 2003 నుంచి. ప్రజాశక్తి ప్రచురణ.